క్లుప్తంగా

పని గంటల పెంపుపై నిరసన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంపు విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎంసీపీఐ, ఏఐసీటీయూ, యుఐఎఫ్ఐ ఆధ్వర్యంలో కొండపల్లి ఎంసీపీఐ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ఉన్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచడంతో పాటు మరో మూడు గంటలు పని పెంచుకునే విధానం కార్మిక శాఖకు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ, యూఐఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు, ఎంసీపీఐ మండల కన్వీనర్ కలకోటి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

చాకిరి విముక్తి పోరాటంలో ఐలమ్మ పాత్ర కీలకం



మైలవరం: రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో చిట్యాల ఐలమ్మ పాత్ర కీలకమైందని ఏపీ రజక వృత్తిదారుల సమైక్య అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు అన్నారు. మైలవరంలో చిట్యాల ఐలమ్మ జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకట్రావు మాట్లాడుతూ ఐలమ్మ ధైర్య సాహసాలను ఈ నాటి మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు తాళ్లూరి శేషగిరిరావు, నాయకులు మల్లెల రాధాకృష్ణ, బుద్దవరపు గోపాల్, రాచూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకంతో ఆరోగ్యం, ఆదాయం



ఆగిరిపల్లి: ఔషధ మొక్కల పెంపకం ద్వారా రైతులు ఆరోగ్యం, ఆదాయం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడిసినల్ ఆరోమెటిక్ ప్లాంట్స్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. పోతవరప్పాడు గ్రామంలో గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆవరణలో 'ఔషధ మొక్కలు పెంపకం-ప్రజా భాగస్వామ్యం-జీవనోపాధి అవకాశాలు అనే అంశంపై రైతులకు, స్వయం సహాయక సంఘాలకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఔషధ మొక్కల పెంపకం వల్ల ఆరోగ్య భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ప్రదీప్ కుమార్, గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఉక్కు కళా వేదికలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈఎస్ఐ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.



మైలవరంలో శ్రీలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



జి.కొండూరు బీసీ కాలనీలో అమ్మవారి అలంకరణ



విస్సన్నపేట ద్వారకానగర్‌లో అమ్మవారు..



మహాలక్ష్మీదేవిగా కోట మహిషాసుర మర్దనీ అమ్మవారు



ఆగిరిపల్లి రజకవీధిలో శాకంబరీదేవిగా..

శంఖ చక్ర గదా హస్తే.. మహాలక్ష్మీ నమోస్తుతే

జి.కొండూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవార్లు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, పందిళ్లలో అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జి.కొండూరు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఐదో రోజు శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. కరెన్సీ నోట్లతో తయారు చేసిన దండను అమ్మవారి మెడలో అలంకరించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులోని శ్రీ రుక్మిణీదేవి సమేత పాండురంగస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు లక్ష రూపాయల నగదుతో అలంకరించారు. నగదు అలంకారంలో రూ. 10, 20, 50, 100, 500 నోట్లను వినియోగించారు. భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- ఇబ్రహీంపట్నం: మూలపాడు విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, రాంబాబు దంపతులు మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చన జరిపించారు. కొండపల్లి మార్కెట్ సెంటర్, ఇబ్రహీంపట్నం ప్రసాద్‌నగర్‌లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.
- విస్సన్నపేట: స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ దేవస్థానంలో అమ్మవారిని, పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.



మూలపాడు విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో పూజలు



బలివేలో మహిళల సామూహిక కుంకుమ పూజలు

వైభవంగా దసరా ఉత్సవాలు

నూజివీడు: స్థానిక శ్రీ కోటమహిషాసురమర్దనీ అమ్మవారిని శుక్రవారం శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు జి.సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ అలివేణి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జంక్షన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతి ఆలయంలోనూ, కోనేరుపేట టీటీడీ కల్యాణ మండపం వద్ద, పాతపేట జ్ఞాన సరస్వతీ ఆలయంలోనూ, 32వ వార్డులోని శ్రీ కనకదుర్గ ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

శాకంబరీదేవిగా దర్శనం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని రుద్రభూమి వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. యాదవుల మండపంలో అమ్మవారికి మహిళలు పాల పొంగళ్లు సమర్పించారు. రజక వీధిలో శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు ఈదులగూడెం, వట్టిగుడిపాడులో మహాలక్ష్మీ దేవి అలంకరణలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. రేణుక క్షేత్రంలో పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



ఆరుగొలనుపేటలో అమ్మవారికి పూజలు

అమ్మవార్లకు పూజలు

బలివే(ముసునూరు): బలివేలోని బలే రామలింగేశ్వస్వామి దేవస్థానంలో అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, లోపూడి, చెక్కపల్లి, వేల్పుచర్ల, రమణక్కపేటల్లోని శ్రీకోదండ రామాలయాల్లో, గుడిపాడు, వలసపల్లి, చింతలవల్లి శివాలయాల్లోనూ అమ్మవారికి మహిళలు, భవాని మాలధారులు కుంకుమార్చనలు చేశారు.



బలివేలో మహాలక్ష్మీ దేవిగా అలంకారం

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చాట్రాయిలో అమ్మవారి విగ్రహం వద్ద భజనలు చేసి భారీగా అమ్మవారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

వరిలో చీడపీడల నివారణతో అధిక దిగుబడులు



పొలంబడి నిర్వహిస్తున్న చాముండేశ్వరి

ముసునూరు: వరి పంటలో చీడ పీడల నివారణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. శుక్రవారం చింతలవల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో చీడ పీడల నివారణ, సమగ్ర కలుపు యాజమాన్యం అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటూ, పెట్టుబడి లేకుండా అతి తక్కువ పెట్టుబడులతో వరి పండించడం ద్వారా చిన్న, సన్నకారు రైతులు మేలు పొందవచ్చన్నారు. అనంతరం వరి క్షేత్రాన్ని పరిశీలించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జానపద నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఇబ్రహీంపట్నం: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని కొండపల్లి మున్సిపాల్టీ ఆధ్వర్యంలో పవిత్ర సంగమం వద్ద ఏర్పాటు చేసిన విజయ నర్తనం ఉత్సవ్ కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక పవన్ బృందం కూచిపూడి నృత్యం, డ్రీమ్ ఆడియో సంస్థ సినీ సంగీత విభావరి, కృష్ణప్రియ నవీన్ బృందం కోలాటం, పద్మశ్రీ హేమంత్ బృందం జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా

తిరువూరు: రాష్ట్రంలో గత ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడానికి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం తిరువూరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బైపాస్‌రోడ్డులోని రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయం వరకు ప్రదర్శన అనంతరం ధర్నా చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, వెంటనే ప్రైవేటీకరణ ఆపాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చలమాల సత్యనారాయణ, తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, ప్రకాష్‌రెడ్డి, పాపారావు, ప్రసాద్, మురళీ కృష్ణారెడ్డి, వెలుగోటి ఆదినారాయణ, యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, నెహ్రూరాజీ, కాంగ్రెస్ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, ఉప్పలపాటి లక్ష్మీదాసు, బొడ్డు ప్రకాశరావు, కొత్తగుండ్ల గోపాలకృష్ణ, సీపీఎం నాయకులు ఎస్వీ భద్రం, బి. వెంకటేశ్వరరావు, పంతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

రైతులకు తప్పని యూరియా కష్టాలు



అనిగండ్లపాడు సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): రైతులకు యూరియా కష్టాలు తప్పటం లేదు. యూరియా కోసం శుక్రవారం రైతులు సొసైటీ వద్దకు పరుగులు పెట్టారు. ప్రస్తుతం వరి పంటకు యూరియా ఎంతో అవసరం. అయితే యూరియా కొందరికి ఎంత కావాలన్నా దొరుకుతోందని, కొందరికి అసలు అందటం లేదని పలువురు రైతులు సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సొసైటీ గోడౌన్ ఉండగా వేరే ఆర్‌బీకే సెంటర్ వద్ద పెట్టి యూరియా కట్టలు ఇవ్వటం ఏమిటని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు చేత పట్టుకుని పడిగాపులు పడుతున్నామని, అన్ని పనులు వదిలేసి యూరియా కోసం నిలబడితే ఒకటి లేదా రెండు బస్తాలు ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

మైలవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సర్నాల తిరుపతిరావు తీవ్రంగా ఖండించారు. మైలవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం తిరుపతిరావు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. పార్టీలపై విద్వేషాలు ఉన్నంత మాత్రాన స్థాయిని మరిచి చౌకబారు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఆయన వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బాలకృష్ణవి అహంకారపూరిత వ్యాఖ్యలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో అహంపూరిత వ్యాఖ్యలు చేయడాన్ని కొండపల్లి మున్సిపల్ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ గుంజ శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. కొండపల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు బాలకృష్ణకు చేసిన సహాయం మరచిపోయి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఎన్టీఆర్ కుమారుడు కాకుంటే బాలకృష్ణకు గుర్తింపు ఉండేది కాదన్నారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు.



మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు



మాట్లాడుతున్న శ్రీనివాస్

పౌష్టికాహారంపై అవగాహనా ర్యాలీ

నందిగామ రూరల్: పోషకాహారం తీసుకోవటం ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది అని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మండలంలోని కంచల గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్బోహైడ్రేట్‌లు, విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ మిశ్రమాలతో కూడిన సంపూర్ణ ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. మనం రోజువారీ తీసుకునే ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్‌లు, మొలకెత్తిన గింజలు, పాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రోటీన్ ఫుడ్‌పై శ్రద్ధ చూపాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు వెంకట్రావమ్మ, కరుణకుమారి, తారాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై అధికారుల విచారణ



గుడిపాడులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఏడీ లింగయ్య

ముసునూరు: పాఠశాలలో ఆక్రమణలు తొలగించి, మరో ప్రభుత్వ భవనంలో కొనసాగించడంపై ప్రజలు ఫిర్యాదు చేయడంతో డివిజన్ స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు పాత హైస్కూల్ తరగతి గదుల్లో స్థానికులు ప్రైవేట్ అవసరాలకు వాడడం, టీడీపీ అనుయాయుడు షామియానా దుకాణం నడపడంపై ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో ఎంపీడీఓ నేతృత్వంలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఎట్టకేలకు ఈనెల 7న ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న షామియానా షాపును తొలగించారు. కాని దానిని తిరిగి నూతనంగా పశుసంవర్ధక శాఖ ఆస్పత్రి కోసం నిర్మిస్తున్న భవనంలోకి మార్చి నడుపుతున్నారు. దీంతో స్థానికులు తిరిగి సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పశుసంవర్ధక శాఖ నూజివీడు ఏడీ లింగయ్య శుక్రవారం విచారణ చేపట్టి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. నూతన భవనం ఎన్ఆర్ఈజీఎస్ నిర్మాణంలో ఉందని తమ శాఖకు అప్పగించలేదని, దీనిని వాడడంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆయన చెప్పారు.

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ అవకాశాలు

ఇబ్రహీంపట్నం: అకడమిక్ విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జాకీర్ హుస్సేన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ అన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాకీర్ హుస్సేన్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి మోహన్‌బాబు మాట్లాడుతూ జాబ్ మేళాకు 139 మంది అభ్యర్థులు హాజరుకాగా 63 మందిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత కంపెనీలు ఆఫర్ లెటర్లు అందజేసి శిక్షణ ఇస్తాయని చెప్పారు. వివిధ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

మన్‌మోహన్‌సింగ్‌కు నివాళి

తిరువూరు: దివంగత భారత ప్రధాని డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ జయంతి కార్యక్రమం తిరువూరు కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మన్‌మోహన్‌సింగ్ చిత్రపటానికి బ్లాక్ కాంగ్రెస్, మండల పార్టీ అధ్యక్షులు బొడ్డు ప్రకాశరావు, పల్లెపాటి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.